

# కథా కౌముది

## వసంతకోకిల

కృపాకర్ పోతుల

"లేమావి చివురులను లెస్సగా మేసేవు
రుతురాజు వచ్చెనని అతిసంభ్రమముతోడ
మావికొమ్మలమీద మైమరచిపాడేవు ...............

నాన్నకత్యంత ప్రీతిపాత్రమైన "కాళోజీ"వారి కవిత. శ్రావ్యంగా మంద్రంగా గొంతెత్తి పాడుతున్న నాన్న. నాన్నకి కోకిలన్నా, కోకిల పాటన్నా, కోకిల కంఠానికా తియ్యదనాన్నిచ్చే చిగుళ్ళని ఆయాచితంగా అందించే గున్నమావిడి చెట్టన్నా మాటల్లో చెప్పలేనంత ఇష్టం.

ఇంటి బయట, పడకగదినానుకొని కుందనపు బొమ్మలాంటి గున్నమామిడిచెట్టు పచ్చరంగు కలబోసిన ఎర్రటి లేత చిగుళ్ళను పట్టుచీర సింగారించుకొన్న అందమైన పల్లె పడుచులా సింగారించుకొని. దాని చిటారు కొమ్మన, ఆ చివుళ్ళ నడుమ, నవరత్నకచిత సింహాసన్నధిరోహించిన మహారాజుకు మల్లే హుందాగా కూర్చొని గర్వంగా గొంతెత్తి కూస్తున్న గండుకోయిల.....ఎక్కడున్న ఏ ప్రేయసికి ఏ ప్రేమసందేశమో ఏమో. జానకి పాటలాంటి మధురమైన కోకిల పాటా దానికి పోటీగానా అన్నట్టు నాన్న గొంతెత్తి మంద్రంగా పాడుతున్న కాళోజీ కవితా.....నాన్ననీ కోకిలనీ సంభ్రమంగా చూస్తూ మైమరచిపోతున్న నేను.....ఇద్దరు మహాగాయకుల జుగల్బందీ వింటూ రసజత్తులో తేలియాడుతున్న రసపిపాసిలా. కాలం స్థంభించిపోయిన అనుభూతి........

మధురమైన రసానుభూతిలో ఓలలాడుతున్న సమయంలో అకస్మాత్తుగా దొర్లిన అపశ్రుతిలా, ఎక్కడో దూరంగా కఠోరంగా మోగుతున్న అలారం చప్పుడు. ఆ చప్పుడు నెమ్మదిగా దగ్గర దగ్గరగా వస్తూ కంటున్న కలని క్రూరంగా ఛిద్రం గావిస్తూ.....సుషుప్తావస్తనుండి జాగృదావస్తలోనికి నన్ను నిర్దాక్షిణ్యంగా నెట్టేస్తూ.... "అయ్యో ఇది వట్టి కలేనా. నాన్న నా ప్రక్కన ఉన్నదీ తనకిష్టమైన కవిత గానం చేస్తున్నదీ నిజం కాదా" అని గుండెను మెలిపెట్టే భావనకూడా మత్తు విడిపోతున్న ఆ క్షణంలోనే. కళ్ళు తెరిచిన నాకు ఎక్కడున్నానో ఏమో వెంటనే స్ఫురించలేదు. అయోమయంగా చూస్తున్న నాకు మంచం ప్రక్కనే నిలబడి నావేపు చూస్తున్న రవీ..... రవి చేతిలో బంగారంలాంటి నా కలని కరిగించేసిన అపరాధి అలారం టైంపీస్.... రక్తపోటుని ఉద్దీపింపచేసే పాశ్చాత్య సంగీతంలా కర్ణకఠోరమైన శబ్దాలు వెదజల్లుతూ. పూర్తిగా మెలుకువ వచ్చేసింది నాకు.

ఆశ్చర్యంగా చూస్తున్న నాకు తెరిచిఉన్న కిటికీ వేపు చూపించాడు చూపుడువేలితో. చూస్తే, నిండు పూతతో ముస్తాబైన గున్నమావీ ఆ మావి గుబురులో శ్రావ్యంగా గొంతెత్తి కూస్తున్న గండుకోకిల.

---000---

ఎన్నాళ్ళ కోరిక. రవితో కలిసి మామిడిచెట్టున్న చక్కటి ఇంటిలో మేమిద్దరమే ఉండాలని. ఆ చెట్టు మరీ పెద్దదిగా మరీ చిన్నదిగా కాకుండా మధ్యస్తంగా ఉండాలనీ, దాని కొమ్మల్లో కనీసం ఒక కొమ్మైనా పడకగదివేపు వాలుతూ ఉండాలనీ, వసంతంలో చివుళ్ళు తొడిగిన మావి గుబుళ్ళలో పొంచిన గండుకోయిలలు గొంతువిప్పాలనీ, ఆ పాటలతో మాఇల్లంతా ప్రతిధ్వనిస్తే వింటూ పులకించిపోవాలనీ..... ఎన్నాళ్ళ కోరిక. ఎప్పుడో అనంతపురం వదిలేసినప్పట్నుండీ మనసులో నాటుకుపోయి ఊరిస్తున్న తీరని కోరిక.

---000---

అనంతపురంలో నాన్నా నేనూ ఇద్దరమే ఉన్న మూడు సంవత్సరాలూ తన జీవితంలో అత్యంత ఆనందకరమైన రోజులు అనేవాడు నాన్నెప్పుడూ. అక్కడ ఇంజనీరింగ్ లో జాయిన్ అయిన తర్వాత ఇంచుమించు ఒక సంవత్సరం పాటు అనుకుంటాను, హాస్టల్ లో ఉండాల్సి రావడం తప్పలేదు నాకు. హాస్టల్ జీవితం దుర్భరంగా ఉండేది నాన్న నాతో లేకపోవడం వల్ల. కాని తప్పదు కదా. ఎలాగోలా కష్టపడి చదువు పూర్తిచేసుకొని మళ్ళీ నాన్నదగ్గరికి వెళ్ళిపోదాం అనే ప్రయత్నంలో సఫలీకృతమౌతున్న సమయంలో ఒకరోజు ఉదయాన్నే నాన్న ప్రత్యక్షం హాస్టల్ దగ్గర....సడి చెయ్యకుండా వచ్చి సందడిచేసే వేసవికాలపు చిరుజల్లులా.

"నేను అనంతపురానికి బదిలీ చెయ్యించుకున్నాను సింధూ" నాన్న పెట్టిన కేక నాకు అర్ధం కావడానికి కొన్ని సెకన్ల సమయం పట్టింది "ఇన్నాళ్ళూ చెప్పలేదమ్మా నీకు బదిలీ కోసం ప్రయత్నం చేస్తున్నట్టు. ఎందుకంటే నీకు "ప్లెజెంట్ సర్ప్రైజ్" ఇవ్వాలని. నిన్ననే రిలీవ్ అయ్యాను. వెంటనే బయల్దేరి వచ్చేసాను. త్రీ లాంగ్ యియర్స్ సింకా. ("సింకా" అంటే "సింధు కన్నా" అని). హాయిగా మనిద్దరమే ఉంటాం" అంటూ చిన్నపిల్లాడిలా ఉత్సాహంగా చెప్తున్న నాన్నని ముద్దుపెట్టేసుకున్నాను ఆనందంతో చిందులేసేస్తూ.

నాన్న అన్న ఆ 'త్రీ లాంగ్ యియర్స్ ' ఎంత త్వరగా గడిచిపోయాయో తలంచుకుంటే ఎంత ఆశ్చర్యంగా ఉంటుందో ఇప్పుడు. కాలేజీకి దగ్గర్లోనే ఇల్లు తీసుకున్నాం. అది నాన్న ఆఫీసుకు కొంచెం దూరమేగాని, ఆ కోలనీ చాలా బాగుందని అక్కడే తీసుకున్నాడు నాన్న. అదిగో అలా అనంతపూర్ లో ఆ కోలనీలో ఉన్నప్పుడే మొదలైంది మామిడిచెట్లతో గండుకోయిలలతో మా "లవ్ ఎఫైర్ ".

అక్కడ మా ఇంటి వెనుకా ముందూ మాత్రమే కాకుండా కోలనీ మొత్తం మామిడిచెట్లతో వేపచెట్లతో నిండి ఉండేది. వసంతకాలంలో చిగురించిన మామిడిచెట్లు గండుకోయిలల తియ్యని పాటలతో హోరెత్తిపోతుంటే, విరబూసిన వేపపూల చిరుచేదు సువాసనతో కోలనీ మొత్తం గుభాళించిపోయేది. ఇంట్లో నేనూ నాన్నా..... ఇద్దరమే. కావలసినంత సమయం మా ఇద్దరికీ.

ఎన్ని కబుర్లో మా మధ్య....తండ్రీ కూతుర్లలా కాకుండా స్నేహితుల్లా. నా కాలేజీ కబుర్లూ, నాన్న ఆఫీసు విశేషాలూ, మేం చదువుతున్న పుస్తకాల విశ్లేషణా, చూసిన సినిమాలపై చర్చలూ, దేశ రాజకీయాలూ, లోకల్ ఫేక్షన్ గొడవలూ "కాదేదీ కబుర్లకనర్హం" అన్నట్టు. నాన్న నాతో నాన్నలా కాకుండా ఒక స్నేహితుడితో మాట్లాడినట్టు మాట్లాడడం, నన్ను తనతో సమానంగా ట్రీట్ చెయ్యడం మా ఫ్రెండ్స్ చాలా మందికి ఆశ్చర్యంగా, నాకు చాలా గర్వంగా ఉండేది.

ఎంత అందమైన నిశ్శబ్దాన్ని ఆస్వాదించాం నేనూ నాన్నా అక్కడ. వసంతకాలంలో వెండి వెలుగుల నులివెచ్చని వెన్నెలలో కోలనీ అంతా కబుర్లు చెప్పుకుంటూ తిరుగుతూ, చలికాలంలో ఘనీభవించిన మంచుముక్కలా వణికిస్తున్న అదే వెన్నెల్లో ఒక్క మాట కూడా మాట్లాడుకోకుండా గంటల తరబడి నిశ్శబ్దంగా డాబా మీద కూర్చొనీ.

ఒకసారి ఏదో పనిమీద నాన్నని కలిసిన మా ప్రొఫెసర్ అన్నాడట "సింధూరికి ఎటెండెన్స్ జస్ట్ బోర్డర్ దాటిందంతే ఈ సెమెస్టర్ కి. తను చాలా బ్రిలియంట్ స్టూడెంట్ . ఫోకస్ తప్పితే ఫస్ట్ రేంక్ మిస్ అవుతుంది. కొంచెం చూసుకోండి" అని.

నాన్న ఆయనకిచ్చిన సమాధానం ఇప్పటికీ మరచిపోలేను నేను. "థాంక్యూ సార్ . కాని చిన్నప్పట్నుండీ రేంకులూ ఐఐటీలూ ఐఏఎస్ లూ అంటూ భయంకరమైన వత్తిడిలో పెంచలేదు తనని. ఆమె బాల్యం, కౌమార్యం ఆనందంగా సాగిపోవాలని కోరుకున్నాను. ఒక పాతిక ముప్పై సంవత్సరాలతర్వాత నా కూతురు తన బాల్యాన్నెప్పుడైనా గుర్తుకుతెచ్చుకుంటే అందులో తీపిగుర్తులేతప్ప చేదు జ్ఞాపకాలకు తావుండకూడదని నా కోరిక.

తను రేంక్ నిలబెట్టుకుంటుందనే నా నమ్మకం. ఒక వేళ నిలబెట్టుకోకపోతే....నా దృష్టిలో అదేమంత పెద్ద సమస్య కానేకాదు." అన్న నాన్నని పిచ్చాడ్ని చూసినట్టు చూసాడట మా ప్రొఫెసర్.

---000---

"తమరు కోరుకున్నట్టుగానే మావిడిచెట్టున్న ఇల్లు మేడం. ఒకటి కాదు రెండు కొమ్మలు తమరి బెడ్రూమ్ ని కప్పేసాయి చూసారా. గండుకోయిల కూడా ఉదయాన్నే వచ్చికూర్చుంది తమరి సుప్రభాత సేవ కోసం. ఒకసారి తమరు పాన్పు దిగి చుట్టూ పరికిస్తారా" అన్నాడు రవి నాటకీయంగా కళ్ళెగరేస్తూ.

---00---

నెల రోజుల క్రితం ఇక్కడికి బదిలీ కాకముందు ముంబాయిలో ఉండే వాళ్ళం. మామిడిచెట్టు కాదు కదా కనీసం వెంపలి మొక్క కూడా కనబడని భయంకరమైన కాంక్రీట్ కీకారణ్యంలో ఐదు బాధాకరమైన భయంకరమైన సంవత్సరాలు. పిచ్చెక్కినట్టుండేది నాకు. అల్లాడి పోతున్న నా బాధ చూడలేక బృహత్ప్రయత్నం చేసి బదిలీ చెయ్యించుకున్నాడీ ఊరికి. గోదావరి జిల్లా లో అందమైన ఊరనీ, చుట్టూ కొబ్బరిచెట్లూ, వరిపొలాలతో చాలా అందంగా ఉంటుందనీ, మనం కారులో ప్రయాణిస్తున్నంతసేపూ మనతో పాటూ గోదావరి కాలువ ప్రాణస్నేహితుడిలా మనల్ని అంటిపెట్టుకొనే వస్తుందనీ, అది భూలోక స్వర్గమనీ, అక్కడందరూ భూలోక రంభలే ఉంటారనీ తెగ ఊరించాడు నన్ను. ఎప్పుడూ చేసినట్టే బదిలీ అయిన ఊరికీ తనే ముందుగా వెళ్ళి ఇల్లు అమర్చుకొని, సామాన్లు కూడా షిఫ్ట్ చేసినతరవాత గాని నన్ను తీసుకురాలేదిక్కడికి. నిన్న రాత్రి ముంబాయి నుండి కారులో వచ్చేటప్పటికి రాత్రి పన్నెండుగంటలు దాటడంతో ఈ ఊరి అందచందాలూ, ఇక్కడి భూలోకరంభలూ, ఇంటి బయట కొలువుతీరిన వేపచెట్టూ ఇవేమీ కనబడలేదు నాకు. రంభల విషయం వందసార్లు చెప్పిన రవి ఇంటిముందున్న మామిడిచెట్టు విషయం ఒక్కసారి కూడా చెప్పనేలేదు నాకు.

"కావాలనే నీకు చెప్పలేదురా. ఎందుకో తెలుసా? మావయ్యేనేంటి, నేను కూడా నిన్ను అలాగే సర్ప్రైజ్ చెయ్యగలనని నీకు చూపించడానికి. నువ్వు ఊహించని కానుక. ఆశ్చర్యంగాలేదూ నీకు" అన్నాడు నా బుగ్గమీద చిన్నగా ముద్దు పెట్టుకుంటూ.

చెమర్చిన కళ్ళూ, మూగబోయిన గొంతూ, ఆనందంతో ఎగసిపడుతున్న హృదయం. నాన్న ఎక్కడికీ వెళ్ళిపోలేదు నన్ను వదిలేసి. ఇక్కడే నాతోనే ఉన్నాడు రవి రూపంలో అనే సంతృప్తికరమైన భావన. తన చేతిని నా చేతిలోకి తీసుకొని పెదాలకి ఆనించుకొని కళ్ళుమూసుకున్నాను నిశ్చింతగా.

కొమ్మమీద వసంతకోకిల కూస్తూనే ఉంది హృద్యంగా.

★★★

Click here to share your comments on this story